గుంతలమయం.. ప్రమాదాలకు నిలయం..

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల ప్రధాన రహదారులు గుంతలమయంతో ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లపై ఉన్న గుంతల్లో నీరు చేరి ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధ్వంసమైన రోడ్లకు మరమ్మతు చేయాలని సంబంధిత అధికారులతో మొర పెట్టుకున్నా తమకేమీ సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాత్రి సమయంలో ఆ మార్గం గుండా రాకపోకలు సాగించాలంటే సావాసం చేయాల్సిందేనని వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ధ్వంసమైన రోడ్లకు మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

– ఎల్‌బీనగర్





పర్యవేక్షణ కరువై.. పిచ్చి మొక్కలకు నెలవై..

వనస్థలిపురం, పరిసర కాలనీల్లో పదుల సంఖ్యల్లో పార్కు స్థలాలు ఉన్నాయి. వీటిలో కొన్ని అభివృద్ధికి నోచుకోగా, కొన్ని కబ్జాలకు గురవ్వగా, మరికొన్ని అధ్వానస్థితిలో ఉన్నాయి. ఆయా పార్కులలో వాకింగ్ ట్రాక్‌లు, గ్రీనరీ ఏర్పాటు చేసిన అధికారులు ఆ తర్వాత వాటిపై పర్యవేక్షణ లేకపోవడంతో అధ్వానంగా మారుతున్నాయి. వనస్థలిపురం డివిజన్ పరిధి ప్రశాంత్‌నగర్‌లో విష్ణు థియేటర్ వెనుకభాగంలో ఉన్న పార్క్ నిర్వహణ లోపంతో పిచ్చి మొక్కలకు నిలయంగా మారింది. పార్క్ గేటువద్ద చెత్త పేరుకుపోవడంతో డంపింగ్ యార్డును తలపిస్తోంది. కళావిహీనంగా మారుతున్న పార్కులపై సంబంధిత అధికారులు దృష్టి సారించకపోవడంతో ఆయా ప్రాంతాల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

– వనస్థలిపురం

గుర్రపుడెక్క.. తొలగించకుంటే రోగాలు పక్కా..

సరూర్‌నగర్ చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్కతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని పరిసర ప్రాంతాల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సైదాబాద్ డివిజన్ శంకేశ్వరబజార్ చౌరస్తాలో ఉన్న భవానీ శంకర్ మాతా దేవాలయం వద్ద మొదలయ్యే చెరువులో భారీగా గుర్రపుడెక్క విస్తరిస్తోంది. వేగంగా పెరిగే లక్షణమున్న గుర్రపుడెక్కను ఎప్పటికప్పుడు తొలగించకుంటే చెరువంతా విస్తరించే ప్రమాదం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికే గుర్రపుడెక్కతో వచ్చే దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. చెరువుకు ఆనుకొని ఉన్న శంకేశ్వరబజార్, సింగరేణి ఆఫీసర్స్ కాలనీల్లో పగటి సమయంలో కూడా ఇళ్ల తలుపులు మూసుకోవాల్సి వస్తుందని ఉన్నతాధికారులు స్పందించి గుర్రపు డెక్కను తొలగించాలని కోరుతున్నారు.

–సైదాబాద్



డివిజన్ అభివృద్ధే లక్ష్యం



రోడ్డు పనులను పరిశీలిస్తున్న మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: చంపాపేట డివిజన్ పరిధి పలు కాలనీలోని సమస్యలను పరిష్కరించి డివిజన్‌ను అభివృద్ధి బాటలో నిలపడమే తన ప్రధాన లక్ష్యమని కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని రెడ్డి బస్తీలో కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఏఈ సురేష్, నాయకులు రాంపురం శ్రీనివాస్, కాలనీ వాసులు శ్రీనిధి, లావణ్య, రాకేష్, జయమ్మ, భాగ్యమ్మ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గడ్డం వివేక్‌కు సన్మానం



గడ్డం వివేక్ వెంకటస్వామితో నాయకులు

చంపాపేట: మాలల సింహ గర్జనను విజయవంతం అయ్యేందుకు పూర్తి సహకారం అందించిన చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామిని మంగళవారం మాలల ఐక్య వేదిక నాయకులు చంపాపేటకు చెందిన కట్టా వెంకటేష్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మద్దెల నర్సింహా, రమేష్, చంద్రయ్య, తిరుమల్‌రావు పాల్గొన్నారు.

పార్టీ ప్రచార రథం ప్రారంభం



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

నాగోలు: రానున్న జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో విద్యార్థుల రాజకీయ పార్టీ (వీఆర్పీ) గెలుపే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు యెచ్చు సునీల్ పేర్కొన్నారు. మంగళవారం నాగోలులో ఆయన పార్టీ ప్రచారరథాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం కేంద్రంగా ఆవిర్భవించిన విద్యార్థుల రాజకీయ పార్టీ అన్ని వర్గాలను కలుపుకొని ప్రజాక్షేత్రంలోకి వెళ్తామన్నారు. సంక్షేమ పాలనను అందించడమే తమ పార్టీ సిద్ధాంతమన్నారు. ఈ కార్యక్రమంలో కమలాకర్, అనిల్ గోగికర్, అనిల్ కుమార్ యెచ్చు, మహేష్ భాగవతుల, పాక నవీన్‌బాబు, కథలయ్య, నందాల అనిల్‌కుమార్ పాల్గొన్నారు

సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: డివిజన్ పరిధి వివిధ ప్రాంతాల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. వివిధ ప్రాంతాల్లో మంగళవారం ఆమె పర్యటిస్తూ స్థానిక సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని చాలా ప్రాంతాల్లో ప్రజలకు మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని వాటి పరిష్కారానికి జీహెచ్‌ఎంసీ నుంచి ప్రత్యేక నిధులు తీసుకొచ్చి పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు కనీస వసతులైన తాగునీరు, రోడ్లు, వీధిదీపాలు, డ్రైనేజీ వంటి సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

హక్కుల సాధనకు పోరాడాలి



మాట్లాడుతున్న సిస్టర్ జన్‌స్టర్స్

వనస్థలిపురం: హక్కుల సాధన కోసం గృహ కార్మికులు సంఘటితంగా ఉండి పోరాడాలని గృహ కార్మికుల యూనియన్ రాష్ట్ర కోఆర్డినేటర్ సిస్టర్ జన్‌స్టర్స్ అన్నారు. ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం పురస్కరించుకుని గృహ కార్మికుల యూనియన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం వనస్థలిపురంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిస్టర్ జన్‌స్టర్స్ మాట్లాడుతూ.. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కులను సాధించుకోవడానికి ప్రతి కార్మికుడు పోరాడాలన్నారు. మానవ హక్కులు స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలకు సంబంధించినవే కాకుండా సార్వత్రిక, సమసమాజ శైలికి చెందినవని అలాంటి హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని, మానవ జీవనాభివృద్ధికి ఈ హక్కులు ఎంతో దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ లీగల్ అడ్వకేట్ వీరమళ్ల, రంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ మాధురి, ఐడియల్ లేబర్‌లైన్ పవన్, గృహ కార్మికులు పాల్గొన్నారు.

వ్యాపారాభివృద్ధికి బిజినెస్ మీట్ దోహదం



కార్యక్రమంలో పాల్గొన్న రమేష్, నరసింహ గుప్తా

నాగోలు: వ్యాపారాలు అభివృద్ధి చెందడంలో బిజినెస్ మీట్‌లు దోహదపడతాయని, ఇమ్మడి జువెలరీ వ్యవస్థాపకుడు ఇమ్మడి రమేష్ పేర్కొన్నారు. నాగోలు డివిజన్ పరిధిలోని కినెన గ్రాండ్ హోటల్‌లో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ వీ–102ఏ గవర్నర్ సూరి శెట్టి నరసింహగుప్తా, ప్రాజెక్ట్ చైర్మన్ బాదం కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్యవైశ్యుల బిజినెస్ మీట్‌లో ఇమ్మడి రమేష్‌తో పాటు ప్రాజెక్ట్ ఇంటర్నేషనల్ సీనియర్ ఉపాధ్యక్షులు విశ్వనాథం నాగేశం, శ్రావణ్‌కుమార్, సినీరంగ లేడీ ప్రొడక్షన్ డైరెక్టర్ దీప్తి మట్ట పాల్గొని వ్యాపారంలో ఉండాల్సిన లక్షణాలు, మెలకువలను వివరించారు. ఈ కార్యక్రమంలో రాజేష్, ధర్మకేశ్వర్, బాదం కళావతి, ఎలుకుర్తి శ్రీనివాస్, అలేటి రవికుమార్, చంద్రమౌళి, వాడకట్టు విజయ్‌కుమార్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

సీఎం కప్ క్రీడలు ప్రారంభం



విద్యార్థులతో చైర్మన్ లక్ష్మి, తహసీల్దార్ జయశ్రీ

మలక్‌పేట: విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలని హైదరబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ చేకోలేకర్ లక్ష్మి అన్నారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో చేపట్టిన సీఎం కప్–24 క్రీడలను మంగళవారం మూసారంబాగ్ స్వామి వివేకానంద స్కూల్ గ్రౌండ్స్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చైర్మన్, సైదాబాద్ మండల తహసీల్దార్ జయశ్రీ, మండల డిప్యూటీ ఈఓ తిరునగరి రాధాకృష్ణ, మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చేకోలేకర్ శ్రీనివాస్, బీజేపీ సీనియర్ నేత బొక్క మధుసూదన్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడాభివృద్ధికి కృషి చేస్తోందన్నారు.

హుండీ చోరీకి యత్నం



చోరీకి యత్నిస్తున్న గుర్తు తెలియని వ్యక్తి

నాగోలు: దేవాలయంలోని హుండీ చోరీకి యత్నించిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..మన్సూరాబాద్‌లోని అయ్యప్ప దేవాలయంలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మాస్క్, గ్లాస్ ధరించి ఆలయ వెనుక భాగం నుంచి లోపలికి ప్రవేశించి హుండీ చోరీ చేసుకుని ద్విచక్ర వాహనంపై పారిపోతుండగా అప్పుడే అటుగా వెళ్తున్న యువకులు కేకలు వేస్తూ కర్రలతో అడ్డగించే ప్రయత్నం చేశారు. నిందితుడు హుండీ అక్కడే వదిలేసి తన వద్దనున్న కత్తులతో బెదిరించి ద్విచక్ర వాహనం వదిలేసి పారిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్‌టీంతో ఆధారాలు సేకరించారు.

స్పా సెంటర్‌పై పోలీసుల దాడి

ఇద్దరి రిమాండ్

చైతన్యపురి: వ్యభిచారం నిర్వహిస్తున్న స్పాసెలూన్ సెంటర్‌పై చైతన్యపురి పోలీసులు దాడిచేసి ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు వివరాల ప్రకారం.. నాగోలు క్రాస్ రోడ్డులోని స్పానిష్ స్పా సెలూన్ సెంటర్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న లా అండ్ ఆర్డర్, ఎస్‌ఓటీ పోలీసులు మంగళవారం సాయంత్రం దాడి చేసి నిర్వాహకుడు శ్రీకాంత్‌రెడ్డి, అనంతపురంకు చెందిన ఓ విటుడు, ఎనిమిది మంది యువతులను అదుపులోకి తీసుకున్నారు. నిర్వాహకుడితో పాటు విటుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భూగర్భ డ్రైనేజీ లైన్ పనులు త్వరగా పూర్తి చేయాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ సూచించారు. మోహన్‌నగర్ కాలనీలో రూ. 9 లక్షల వ్యయంతో చేస్తున్న నూతన డ్రైనేజీ లైన్ పనులను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలన్నారు. కార్పొరేటర్ వెంట రాంరెడ్డి, అశ్విన్‌సింగ్, కొత్త తిరుమల, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

సన్మానం



సిబ్బందితో సంక్షేమ సంఘం సభ్యులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని ఆర్‌కేపురం నివాసుల ఇన్‌కామ్ టాక్స్ డిపార్ట్‌మెంట్ ఎంప్లాయీస్ బిల్డింగ్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యుత్, వాటర్ వర్క్స్, పారిశుద్ధం, శానిటేషన్ సిబ్బంది, గార్డెన్ వర్కర్లు, డాక్టర్స్ అనేక ఇతర సేవలను అందించే వారందరికీ మంగళవారం కాలనీలో సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉపేందర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. అనునిత్యం కాలనీలవాసులకు సేవలందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అన్నపూర్ణ, నరహరిరావు, గణేష్‌బాబు, గోపాల్, శ్రీనివాస్, శ్రవణ్, నీలిమ, రాధ, విజయలక్ష్మి, స్వప్న, అర్చన, పుష్ప, సరిత, సురేఖ పాల్గొన్నారు.

త్రోబాల్ క్రీడాకారులకు సన్మానం



చింటూరెడ్డి, కల్యాణ్‌పటేల్‌ను సన్మానిస్తున్న ప్రతినిధులు

మన్సూరాబాద్: పారా ఏషియన్ చాంపియన్ షిప్ త్రోబాల్ పోటీల్లో స్వర్ణం సాధించిన జట్టులోని సభ్యులైన గోనే చింటూరెడ్డి, కల్యాణ్ పాటిల్‌కు మన్సూరాబాద్ డివిజన్ పరిధి శైలజాపురికాలనీలోని దివ్యాంగుల వసతిగృహం ఆవరణలో సామ రంగారెడ్డి ఫౌండేషన్ కో ఆర్డినేటర్ గంగదాసు కృష్ణారెడ్డి, మేనేజర్ నాంపల్లి రామేశ్వర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ.. మనోధైర్యం ముందు శారీరక అంగవైకల్యం ఓడిందన్నారు. పారా పోటీల్లో దేశానికి స్వర్ణపతకం సాధించిన క్రీడాకారులు మన్సూరాబాద్‌లో ఉండటం గర్వకారణమని స్పష్టం చేశారు. ఎన్ని కష్టాలు వచ్చినా తాను అనుకున్నది సాధించేందుకు చింటూరెడ్డి అహర్నిశలు శ్రమించాడని, కష్టపడితే ఫలితం దక్కుతుందని నిరూపించాడన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు వెంకట్‌రెడ్డి, హాస్టల్ వార్డెన్ ఐలయ్య పాల్గొన్నారు.

హామీలు అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్‌దే



పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న కేఎల్‌ఆర్

దిల్‌సుఖ్‌నగర్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ఒకొక్కటిగా అమలు చేస్తుందని మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఆర్‌కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న నిర్మలా గణేష్ నేత ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేఎల్‌ఆర్, దేప భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. అనేక సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికే దక్కిందన్నారు. త్వరలోనే పేదలకు ఇళ్లు మంజూరు చేస్తామని, నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డి, తీగల అనితరెడ్డి, రఘుపతి, బండి మధుసూదర్‌రావు, లక్ష్మి, గట్ల రవీంద్ర, జెల్లా జగన్నాథం, సురేందర్, యాదవరెడ్డి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

వనస్థలిపురం: హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని భూలక్ష్మీనగర్ కాలనీ సంక్షేమ సంఘానికి నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ప్రధాన కార్యదర్శి రవికిరణ్ పానుగుపాటి తెలిపారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా కాశీపతి, ఉపాధ్యక్షుడిగా కంబపు శ్రీధర్, సహాయ కార్యదర్శిగా సామ దామోదర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా టి.రవిందర్‌రెడ్డి, కోశాధికారిగా నాగేశ్వర్‌రావు ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా ప్రతినిధుల సహకారంతో కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

తెలంగాణ తల్లిని కాంగ్రెస్ తల్లిగా మార్చారు

● ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చైతన్యపురి: ప్రభుత్వాలు మారితే ప్రజల తలరాతలు మార్చాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లిని మార్చిందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి విమర్శించారు. చైతన్యపురి డివిజన్ ప్రభాత్‌నగర్‌లో నిర్వహించిన తెలంగాణ తల్లికి పాలాభిషేకం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఉద్యమకాలంలో రూపొందించిన తెలంగాణ తల్లిని కాంగ్రెస్ తల్లిగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తెలంగాణ అస్తిత్వం మీద దాడి చేస్తూ చరిత్ర ఆనవాళ్లు నాశనం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మహేష్‌యాదవ్, చంద్రశేఖర్‌రెడ్డి, రవిముదిరాజ్, త్రివేది, పవన్, జయశ్రీ, గట్టు శ్రీను, రమణారెడ్డి, జలందర్, నిరంజన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక పాలనకు చరమగీతం తప్పదు..

సైదాబాద్: ప్రజావ్యతిరేక పాలనకు పాల్పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి చరమగీతం తప్పదని బీఆర్ఎస్ యాకత్‌పురా ఇన్‌చార్జి సామ సుందర్‌రెడ్డి అన్నారు. ఐఎస్‌సదన్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ స్వప్నారెడ్డి, బీఆర్ఎస్ నాయకులతో కలిసి భానునగర్‌లో తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయం నుంచి తెలంగాణ వాసులకు స్ఫూర్తిగా నిలిచిన తెలంగాణ తల్లి రూపాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఏకపక్షంగా మార్చడం తెలంగాణ సమాజాన్ని అవమానించడమే అన్నారు. ఈ కార్యక్రమంలో మెట్టు భాస్కర్‌రెడ్డి, కార్తీక్, శివ, ప్రవీణ్ పాల్గొన్నారు.



తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అజంపురా పార్టీ కార్యాలయంలో..

చాదర్‌ఘాట్: తెలంగాణ తల్లిని అవమానిస్తే సహించేది లేదని మాజీ మంత్రి మహమూద్‌అలీ అన్నారు. అజంపురా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంస్కృతి, సంప్రదాయానికి నిలువుటద్దమైన తల్లిని రాష్ట్ర ప్రభుత్వం అగౌరపరిచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అజిత్‌రెడ్డి, ఆజం అలీ, భూమేష్, సాయి భువనేశ్వరి పాల్గొన్నారు.



పాలాభిషేకం చేస్తున్న మహమూద్‌అలీ

ఆర్‌కేపురం చౌరస్తాలో..

దిల్‌సుఖ్‌నగర్: అధికారంలోకి వస్తే ప్రజల తలరాతలు మారుస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు తెలంగాణ తల్లిని మార్చడం దుర్మార్గమని మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ అన్నారు. ఆర్‌కేపురం చౌరస్తాలో నిర్వహించిన తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉద్యమకాలంలో రూపొందించిన తెలంగాణ తల్లిని కాంగ్రెస్ తల్లిగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నగేష్, రామాచారి, రామ్ నరసింహ గౌడ్, సాజిద్, కొండ్ర శ్రీనివాస్, వెంకటేష్ గౌడ్, కంచర్ల శేఖర్, జగన్, శ్రీమన్నారాయణ, పెంబర్తి శ్రీనివాస్, బాలు శ్రీ, శంకర్, వాన పాస వెంకటేష్,అనురాధ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9666021515
9505507616
9912220363
9912220365